క్లుప్తంగా

హైమాస్ట్ లైట్ల ఏర్పాటులో అవినీతి

చొప్పదండి: నియోజకవర్గంలో హైమాక్స్ లైట్ల ఏర్పాటులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం వంశీ కోరారు. ఆదివారం జరిగిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. రూ. 45 వేలకు మించని ఒక్కో హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు రూ.1.20 లక్షల బిల్లులు వేయించి కాజేశారని ఆరోపించారు. ప్రజల సొమ్మును దోచుకోవడంపై గతంలో ఫిర్యాదు చేసినా అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిడి తెచ్చి విచారణను అడ్డుకున్నారని, ఇప్పటికైనా విచారణ జరిపి అవినీతిని బట్టబయలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కండె సమ్మయ్య, సిద్దంకి రాజయ్య, లక్ష్మిరాజం, తదితరులున్నారు.

విశ్వజన కళామండలికి గణేశ్ ఎంపిక



వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు గణేశ్‌ను 31న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విశ్వజన కళామండలి 45వ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రజా యుద్ధనౌక గద్దర్ నివాళి సభకు 45 మందితో 45 పాటల స్వరార్చన కార్యక్రమానికి ఎంపిక చేశామని కళాబృందం వ్యవస్థాపకుడు గోనెల సమ్మన్న, మాస్టార్ జీ ఆదివారం తెలిపారన్నారు. ఈ సందర్భంగా కళా బృందం వ్యవస్థాపకుడు గోనెల సమ్మన్న, మాస్టార్ జీలకు గణేశ్ కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమానికి కళాభిమానులు, కవులు, కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై గద్దర్‌కు నివాళి అర్పించాలని కోరారు.

వాహనాల తనిఖీ



జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

పర్లపల్లిలో మెగా హెల్త్ క్యాంప్



పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిమ్మాపూర్: మండలంలోని పర్లపల్లి గ్రామంలో ఆదివారం దీపిక హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ మాదాడి భారతిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... సంపూర్ణ ఆరోగ్య రక్ష గ్రామమే ధ్యేయంగా ప్రజల శ్రేయస్సు కోసం క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వైద్యులు వెంకటేశ్వర్లు, కిరణ్, మహేశ్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సుమారు 200 మంది పలురకాల వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముప్పిడి సంపత్ రెడ్డి,ఉప సర్పంచ్ రాజేశ్, శంకర్ శ్రీధర్ మధుసూదన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన శ్రీరాముల రవి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆదివారం మృతుడి కుటుంబానికి హుజూరాబాద్ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూ.4,500 అందించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు జంపాల రితేశ్, కమిటీ అధ్యక్షుడు నారాయణదాసు కార్తీక్, సమ్మెట సారయ్య, మురహరి రాజు, తూముల శ్రావణ్, సమ్మెట అచ్యుత్, మురహరి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

హుజూరాబాద్: పట్టణానికి చెందిన నల్ల మొండయ్య ఇటీవల మృతిచెందగా ఆయ కుటుంబాన్ని ఆదివారం వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.22,200, బియ్యం అందజేశారు.

ప్రయోగాల్లేవు.. పతకాలు రావు

- విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబర్చలేకపోతున్న విద్యార్థులు
- ప్రయోగశాలలు, ఉపాధ్యాయులున్నా పట్టింపు లేదని ఆరోపణలు
- దుమ్ము, ధూళితో నిండుకుంటున్న సైన్స్‌ల్యాబ్‌లు



రేకొండ పాఠశాలసైన్స్‌ల్యాబ్‌లో మూలనపపడిన పరికరాలు

చిగురుమామిడి: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తగిన ప్రదర్శన కనబర్చలేకపోతున్నారు. రెండేళ్లుగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎలాంటి ఉత్తమ బహుమతులు సాధించలేకపోయారు. జిల్లాలో ఏటా అక్టోబర్‌లో నిర్వహించే సైన్స్ దినోత్సవంలో పాల్గొంటున్నప్పటికీ విద్యార్థులు పోటీల్లో రాణించలేకపోతున్నారు. ప్రయోగశాలలు, భౌతిక, రసాయన, జీవశాస్త్ర ఉపాధ్యాయులున్నప్పటికీ ప్రతిభ కనబర్చడం లేదనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. మండలంలోని తొమ్మిది జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, మోడల్ స్కూల్లో ప్రయోగశాలలు, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అయినా సబ్జెక్టు బోధన అనంతరం టీచర్లు విద్యార్థులను ప్రయోగశాలవైపు తర్ఫీదు చేయలేకపోతున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి.

నిధులు మంజూరు చేస్తున్న విద్యాశాఖ

ప్రయోగశాల, పరికరాల కోసం విద్యాశాఖ ఏటా నిధులు మంజూరు చేస్తుంది. జెడ్పీ పాఠశాలకు సంవత్సరానికి రూ. పదివేల చొప్పున ఇస్తుంది. లైబ్రరీ, రసాయనాల కొనుగోలు, ఇతరవాటికి వినియోగించాలనే నిబంధనలున్నాయి. ఇదే క్రమంలో హెచ్ఎంలు వచ్చిన నిధులను ఖర్చుచేస్తున్నారు. 2015–16 సంవత్సరంలో మాత్రమే ప్రయోగశాలల కోసం రూ. 22వేలు మంజూరు చేసింది. అప్పటి నుంచి నేటి వరకు ప్రత్యేకంగా నిధులేమి కేటాయించలేదు.

బూజుపడుతున్న ప్రయోగశాలలు

కొన్ని పాఠశాలల్లో ప్రయోగశాలలు అసలు తెరుచుకోవడం లేదు. దుమ్ము, ధూళితో నిండుకున్నాయి. విద్యార్థులకు విషయ పరిజ్ఞానం సరిగా అర్థంకాక కాంపిటేటివ్‌ల్లో రాణించలేకపోతున్నారు. మొదటి త్రైమాసిక పరీక్షల నుంచి విద్యార్థులకు ప్రయోగశాలలను అలవాటు చేయించాల్సి ఉంది. కానీ కొందరు ఉపాధ్యాయులు పట్టించుకోవడంలేదు.

అన్నిపాఠశాలల్లో సైన్స్ టీచర్లు

తొమ్మిది జెడ్పీపాఠశాలలకు చిన్నముల్కనూర్‌లో మాత్రమే సైన్స్ టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. ఇందుర్తి సక్సెస్ స్కూల్‌ల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ప్రయోగశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూడునెలల క్రితం పనులు పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఎనిమిది, పదో తరగతి విద్యార్థులను మాత్రమే ఒకటి లేదా రెండుసార్లు ప్రయోగశాలకు తీసుకెళ్తున్నారు. ఆరో తరగతి నుంచి విద్యార్థులకు సైన్స్‌ల్యాబ్‌పై అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో సైన్స్ పోటీల్లో రాణించే అవకాశం ఉంది.

అవగాహన కల్పిస్తాం



ఎనిమిది నుంచి పదోతరగతి విద్యార్థులను సైన్స్‌ల్యాబ్, దాని ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి మూడు నెలలకోసారి ల్యాబ్‌కు వెళ్లి ప్రయోగాలు చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇటీవల జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నప్పటికీ ఎలాంటి బహుమతులు రాలేదు.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో, చిగురుమామిడి

- **నియామకం**

హుజూరాబాద్: కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన కొంగటి రాజ్‌కుమార్ తీన్మార్ మల్లన్న టీమ్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా, కో-ఇన్‌చార్జిగా వీణవంకకు చెందిన దాట్ల శ్రీను నియామకమయ్యారు. ఈమేరకు టీమ్ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకుమార్, కరీంనగర్ అధ్యక్షుడు అఖిల్ పాషా, హన్మకొండ అధ్యక్షుడు రామన్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

- **ఆదర్శయూత్ అధ్యక్షుడిగా శివకుమార్**

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ఆదర్శయూత్ అధ్యక్షుడిగా చెరుకు శివకుమార్‌ను ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు అనిల్ తెలిపారు. ప్రధాన కార్యదర్శులుగా బొంగోని అభిలాశ్, గుర్రం వంశీ, ఉపాధ్యక్షులుగా సుధీర్, శ్రీకాంత్, శ్రీధర్, మణిసాయి, కోశాధికారిగా అరవింద్, కార్యదర్శులుగా రాకేశ్, ఆనంద్, రాకేశ్, ప్రణీత్, అభిరాత్‌ను నియమించామని పేర్కొన్నారు.

- **ఆర్థికసాయం అందించాలి**

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డా.గోసికొండ శ్రీరాములు అమెరికాలోని హవాయి రాష్ట్రంలో జనవరి మొదటి వారంలో జరగబోయే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో పరిశోధన వివరించాల్సి ఉందంటూ ఆహ్వానం అందింది. ఈమేరకు వెళ్లేందుకు సుమారు రూ.మూడు లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు ఎవరైనా స్పందించి ఆర్థికసాయం అందించాలని కోరారు.

- **నేత్రదానం**

మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పాముల సతీశ్(37) శనివారం మృతిచెందాడు. భార్య సౌజన్య, తల్లిదండ్రులు మధునమ్మ, వెంకటనర్సయ్య సతీశ్ నేత్రాలను ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశామని ఆదివారం తెలిపారు.

మోసపూరిత హామీలను నమ్మొద్దు



కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఆదివారం మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా రసమయి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ... మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని సీఎం కేసీఆర్ అయ్యాక మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారద, సొసైటీ చైర్మన్ స్వామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, నాయిని వెంకట్ రెడ్డి, మహేందర్, పర్శరాములు, రమేశ్, సంపత్, రవి, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టొద్దు

చిగురుమామిడి: ప్రతిపక్షాల మాటలు నమ్మి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టొద్దని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని రేకొండ, బొమ్మనపల్లి, సుందరగిరి, ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని, దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణను రోల్ మోడల్‌గా తీసుకుంటున్నాయని అన్నారు. కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటలతో మోసపోవద్దని, మరోసారి ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ హుస్నాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. 60 ఏళ్లలో కానీ అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో చేశారని అన్నారు. ప్రచారంలో మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఎంపీపీ కొత్త వినీతా, నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు పిట్టల రజిత, కానుగంటి భూంరెడ్డి, చెప్యాల మమత, పెద్దపల్లి భవాని, ఎంపీటీసీలు కొత్తూరి సంధ్య, మిట్టపెల్లి మల్లేశం, మెడబోయిన తిరుపతి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, నాయకులు , మహిళలు, యువకులు రైతులు పాల్గొన్నారు.



రేకొండలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రచారం

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన సుమారు 100 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపసర్పంచ్‌ల ఫోరం మండల ఉపాధ్యక్షుడు దంసాని తిరుపతి, నాయకులు తరిగొప్పుల నర్సయ్య,పెద్ది హరిశంకర్,పెద్ది అనిల్,పెద్ది శివకుమార్ ఉన్నారు.

జమ్మికుంట: మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. హుజూరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు అరవింద్, వెంకటేశ్, రాజ్‌కుమార్, సాగర్,అజయ్, దేవేందర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, సదానందం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రణవ్‌కు నాయీబ్రాహ్మణ సంఘం మద్దతు

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్‌కు నాయీబ్రాహ్మణ సంఘం తరఫున మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు విష్ణుదాస్‌గోపాల్‌దాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణులు ఎదిగేందుకు పార్టీ కృషి చేస్తుందని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పేర్కొన నేపథ్యంలో ప్రణవ్‌కు మద్దతు ఇస్తున్నామని వివరించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెపల్లి మోహన్

తిమ్మాపూర్: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని బీజేపీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెపల్లి మోహన్ అన్నారు. మండలంలోని మొగిలిపాలెం పర్లపల్లి, నల్లగొండ, మక్తపల్లి, బాలయ్యపల్లి, కొత్తపల్లి, నుస్తులాపూర్, ఇంద్రనగర్, గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినిమాల్లో నటించేవారిని, వైద్య వ్యాపారం చేసే వారిని సేవ చేసే నాయకుడిగా ప్రజలు గుర్తించడం లేదని, నియోజవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని బీజేపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని అన్నారు. పలువురు నాయకులు ఆరెపల్లి సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు జగదీశ్వర చారి, జగన్ రెడ్డి, జోగిరెడ్డి, శ్రీనివాస్, సంపత్, అనిల్, తిరుపతిరెడ్డి, హరికష్ణ, చింతం వరలక్ష్మి, అరుణ్, స్వామి, లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్, రాజశేఖర్, రాఘవరెడ్డి, సునీల్, అశోక్, రంజిత్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఆదివారం బీజేపీ జిల్లా నాయకుడు మియాపురం లక్ష్మణాచారి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వీరస్వామి, మహేశ్‌కుమార్, సతీశ్, కనకయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే పార్టీ బీసీని ముఖ్యమంత్రి చేస్తుందని మండల అధ్యక్షుడు అనిల్ అన్నారు. ఈకార్యక్రమంలో సమ్మిరెడ్డి, దొంగల రాములు, సాగర్, తదితరులుఉన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల, వెదిర, కిష్టాపూర్, పందికుంటపల్లి, షానగర్ గ్రామాల్లో ఆదివారం బీజేపీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి బొడిగె శోభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, గతంలో ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి తప్పా ఇప్పుడు చేసింది ఏమీ లేదన్నారు. చొప్పదండి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్ యాదవ్, మోడీ రవీందర్, ఉప్పు రాంకిషన్, శ్రీనివాస్, విద్యసాగర్, నరేష్, సునీల్ పాల్గొన్నారు.

బీసీ ముఖ్యమంత్రి ప్రకటన హర్షణీయం

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించడం హర్షణీయమని బీజేపీ నాయకులు, చెల్పూర్, రంగాపూర్ సర్పంచులు నేరెళ్ల మహేందర్‌గౌడ్, బింగి కరుణాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని చెల్పూర్ గ్రామంలో మాట్లాడుతూ..బీసీల అభ్యున్నతి కోసం బీజేపీని రాష్ట్రంలో గెలిపించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు.



రామడుగు: వెలిచాలలో బీజేపీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి బొడిగె శోభ ప్రచారం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ

రామడుగు: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని రాంచెంద్రాపూర్, శ్రీరాములపల్లి, చిప్పకుర్తి గ్రామాలలో ఆదివారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్యప్రసన్న, బీసీ విభాగం అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు బొమ్మరవేని తిరుపతి, కోల రమేష్, పంజాల శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, కట్ల శంకర్, బాపిరాజు, రవి, మహ్మద్ ఆసిఫ్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలోకాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో ముదిరాజ్‌లు పార్టీలో చేరారు. గ్రామంలో దళితులు, ముదిరాజ్‌లతో భారీ ర్యాలీ తీశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని సత్యనారయణ అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బస్వయ్య, సంతోష్, మల్లారెడ్డి, తదితరులుఉన్నారు.



శంకరపట్నం: మొలంగూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన ముదిరాజ్‌లు

ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు

చిగురుమామిడి: రాష్ట్ర ప్రజలను సీఎం కేసీఆర్ మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని, అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం చిగురుమామిడిలో మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ పోటీచేయనున్నారని, రెండు రోజుల్లో మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టనున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను సీఎం కేసీఆర్ కాపీ కొట్టారని ఆరోపించారు. హుస్నాబాద్‌లో ప్రభాకర్‌గౌడ్ గెలుపును ఎవరూ ఆపలేరని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.



రామడుగు: ఓట్లు అభ్యర్థిస్తున్న మేడిపల్లి సత్యం

అర్హులకు 'డబుల్' ఇళ్లు అందలేదు

వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్



తిమ్మాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించలేదని వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ నియోజకవర్గంలోని బలహీన వర్గాలకు ఎమ్మెల్యే, మంత్రిగా గంగుల కమలాకర్ ఎలాంటి మేలు చేయలేదని, అర్హులను డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎంపిక చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పేదలను ఓటు అడిగే హక్కు మంత్రికి లేదని, కేబుల్ బ్రిడ్జ్ కుంగితే దర్యాప్తు జరిపించకపోవడం దురదృష్టకరమని, కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకే పరిమితమని, మిగతా గ్యారంటీలు నాన్ గ్యారెంటీలని ప్రజల గుర్తించాలన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి..

ఇల్లందకుంట: ప్రజల ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి రాబోతున్నట్లు సామాజిక కార్యకర్త సబ్బని వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండలానికి చెందిన పలువురు పద్మశాలీ కులస్తులను కలిశారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం ఇష్టమని ఉద్యోగం చేస్తూనే తనవంతు బాధ్యతగా పేదకుటుంబాల్లోని విద్యార్థుల ఉన్నత చదువులకు అవసరమైన చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఉన్న ఊరు కన్నవారిని మరచిపోవద్దనే ఉద్దేశంతో సామాజానికి సేవ చేస్తున్నానని, నియోజకవర్గంలోని పద్మశాలీలు రాజకీయాల్లోకి రావాలని ఒత్తిడి తెస్తున్నారని వారి నిర్ణయం మేరకు వారం రోజుల్లో నిర్ణయం వెల్లడిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలీ కులసంఘం నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, చంద్రశేఖర్, కోటేశ్వర్, కాశినాదం, రామనాథం, వెంకటనారాయణ, తిరుపతి, వైకుంఠం, దేవేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మతల్లిని దర్శించుకున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో పోచమ్మ బోనాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిఫెస్టో ప్రవేశపెట్టారని, బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ పుల్లాచారి, నాయకులు చొల్లేటి కిషన్‌రెడ్డి, మంతెన శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, నాయకులు